క్లుప్తంగా

సీఎంను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు (టౌన్‌): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్‌ కార్యాలయంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు.

అలరించిన రాగ తరంగిణి



గాయకుడు మల్లికార్జునకు సత్కారం

నెల్లూరు(బృందావనం): గాయకుడు ఏసుదాస్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో గాన తరంగిణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్‌ ముక్కాల ద్వారకానాథ్‌, 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడారు. ఏసుదాస్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. అనంతరం గాయకుడు మల్లికార్జునను సత్కరించారు. విజయ్‌ మ్యూజికల్‌ డ్యాన్స్‌ అకాడమీ నిర్వాహకుడు విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్‌, హరిబాబు, హరనాథ్‌రెడ్డి, ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపల్‌ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట రిలే దీక్షలు



నెల్లూరు(అర్బన్‌): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ వద్ద రిలే దీక్షలను బుధవారం చేపట్టారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌ షరీఫ్‌, అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌, లీలామోహన్‌, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడు, గోదాదేవికి పూజలు



నెల్లూరు(బృందావనం): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో కృష్ణుడు, గోదాదేవి అమ్మవార్లకు విశేష పూజలను బుధవారం నిర్వహించారు. 108 పాత్రల్లో ఫలాలతో పాటు పాయసాన్ని నైవేద్యంగా సమర్పిస్తూ మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా సుబ్రహ్మణ్యం, వెంకటమణికంఠకుమార్‌, విద్యాలక్ష్మి వ్యవహరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బారామరాజు, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి వేణుగోపాల్‌, నాగమణి పాల్గొన్నారు.

14, 15న జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

తోటపల్లిగూడూరు : మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్‌ కమిటీ సభ్యులు తిరువళ్లూరు ఈశ్వరయ్య, కదురు వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా ఎస్‌ఎస్‌ కన్‌స్ట్రక్షన్‌, ఎంఎంఆర్‌ కన్‌స్ట్రక్షన్ల అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి సంయుక్తంగా చెడుగుడు పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. తొలి ఐదు స్థానాల్లో నిలిచిన పురుషుల జట్లకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలను నగదు బహుమతిగా అందిస్తారన్నారు. అలాగే మహిళల జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలను నగదు బహుమతిగా అందిస్తారన్నారు. అత్యుత్తమ క్రీడా ప్రదర్శన చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సదుపాయంతో పాటు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 94409 81992, 97046 82519 అనే నంబర్లను సంప్రదించాలని కార్యనిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్‌: ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని నెల్లూరు రూరల్‌ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్‌ పరిధిలోని 26వ డివిజన్లో గల త్యాగరాజనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులకు కరపత్రాలను అందజేశారు. సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికే ఆదర్శవంతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి పథకాలను అందించే అంశంలో తాను అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్పొరేటర్‌ సుప్రజ, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు పురుషోత్తమ్‌ యాదవ్‌, నరసింహ ముదిరాజ్‌, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మల పండగకు మెరుగైన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌

నెల్లూరు(బృందావనం): గొబ్బెమ్మల పండగకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన ఏర్పాట్లు చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ పేర్కొన్నారు. పెన్నా తీరంలో జరగనున్న గొబ్బెమ్మల పండగకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 16న గొబ్బెమ్మల పండగ నాడు జిల్లాలోని వివిధ దేవస్థానాల నుంచి స్వామివార్లు పినాకినీ తీరానికి విచ్చేయనున్నారని పేర్కొన్నారు. పెన్నా తీరం వద్ద ఆర్కెస్ట్రా, గేమ్స్‌ సౌకర్యాలను కల్పిస్తూ పండగ వాతావరణాన్ని నెలకొల్పేలా చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు. పారిశుధ్యం, విద్యుద్దీపాలు, తదితరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా పోలీసులను తగినంత మందిని నియమించాలని, పార్కింగ్‌ సమస్య రాకుండా చూడాలని చెప్పారు. డిప్యూటీ మేయర్‌ ఖలీల్‌ అహ్మద్‌, కార్పొరేటర్లు అస్మా, రవిచంద్ర, రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌ శివకుమార్‌ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి ఆరాధన



నెల్లూరు(బృందావనం): బహుళ పంచమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని త్యాగరాజ మందిరంలో స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. త్యాగరాజస్వామి భక్త బృంద ఆధ్వర్యంలో భిక్షాటన, నగర సంకీర్తనను చేపట్టారు. చెన్నై, నెల్లూరు కళాకారులు, బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల విద్యార్థులతో పంచరత్న గోష్ఠి, ఔత్సాహిక కళాకారులతో త్యాగరాజ కృతుల గానాన్ని విశేషంగా నిర్వహించారు. మాచవోలు వెంకటసుబ్బయ్య, భాస్కరశర్మ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాన్ని జరిపారు. ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



నారాయణలో..



నలందలో..

నెల్లూరు (టౌన్‌): రామలింగాపురంలోని నారాయణ స్కూల్లో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. హరిదాసు, తదితర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. తల్లులకు రంగవల్లుల పోటీలు, విద్యార్థులకు పతంగుల పోటీలను నిర్వహించారు. ఏజీఎం రమణారెడ్డి, డీన్‌ నరేంద్ర, ప్రిన్సిపల్స్‌ వెంగళరావు, సోనీ, అకడమిక్‌ డీన్లు బిందు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

• కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో రంగవల్లుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

• బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో విద్యార్థులు పలు వేషధారణలతో అలరించారు. అనంతరం విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్‌ ఖాసింపీరా, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, తదితరులు పాల్గొన్నారు.



కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో..

మత్తులోకి జారుకున్న తల్లి

• రోడ్డుపైకి వెళ్లిన చిన్నారులు
• శిశు గృహానికి తరలించిన ఐసీపీఎస్‌ అధికారి

నెల్లూరు(క్రైమ్‌): ఓ తల్లి మద్యం మత్తులో తన ముగ్గురు పిల్లలను వదిలేసి నిద్రలోకి జారుకోవడంతో ఐసీపీఎస్‌ అధికారులు సదరు పిల్లలను శిశు సంరక్షణ గృహానికి తరలించిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఐసీపీఎస్‌, పోలీస్‌ అధికారుల సమాచారం మేరకు.. కోట మండలం గొనుగుపల్లికి చెందిన గణేష్‌, చెంచమ్మ దంపతులకు మూడేళ్ల శ్రీనమ్మ, రెండేళ్ల మధు, పది నెలల లక్ష్మి పిల్లలు. భిక్షాటన, చిత్తు కాగితాలను ఏరుకొని రాత్రి వేళ రోడ్లపై నిద్రిస్తుంటారు. ఈ క్రమంలో చెంచమ్మ పూటుగా మద్యాన్ని మంగళవారం సేవించారు. వీఆర్సీ సెంటర్‌లోని ఓ వస్త్ర దుకాణ పక్కన ఉన్న బస్టాండ్‌లో పిల్లలకు పాలు పడుతూ నిద్రలోకి జారుకున్నారు. దీంతో రోడ్డుపైకి పిల్లలు వచ్చి ఆడుకోసాగారు. అటుగా వచ్చే వాహనాలకు అడ్డుపోయారు. అక్కడే ఉన్న జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్‌ విషయాన్ని గమనించారు. పిల్లలను రోడ్డుపై నుంచి పక్కకు తీసుకొచ్చి.. చెంచమ్మను నిద్రలేపేందుకు విఫలయత్నం చేశారు. దీంతో పిల్లలు అక్కడే ఉంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన సురేష్‌ తన సిబ్బందిని పిలిపించి ఆటోలో వారిని శిశు సంరక్షణ గృహానికి తరలించారు. అనంతరం విషయాన్ని చిన్నబజార్‌ పోలీసులకు తెలియజేశారు. బుధవారం నిద్రలేచిన చెంచమ్మకు పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించి పోలీసులను ఆశ్రయించారు. శిశు సంరక్షణ గృహంలో పిల్లలున్నారని పోలీసులు చెప్పడంతో ఆమె కృతజ్ఞతలను తెలియజేశారు.

వెంకయ్యనాయుడి దృష్టికి యాప్‌ వివరాలు

నెల్లూరు(బృందావనం): వెంకటాచలంలోని స్వర్ణభారత్‌ ట్రస్ట్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడ్ని ఏ ట్రస్ట్‌ అధ్యక్షుడు వెంకటేష్‌ బుధవారం కలిశారు. తాను రూపొందించిన అకౌంట్‌ పే యాప్‌ వివరాలను వెంకయ్యనాయుడికి వివరించారు. అందరికీ ఉపయోగపడేలా యాప్‌ను తీర్చిదిద్దానని ఆయన చెప్పారు.

నియామక ఉత్తర్వుల అందజేత



నెల్లూరు(సెంట్రల్‌): కారుణ్య నియామకం ద్వారా రిజిస్ట్రేషన్‌ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా వెంకటశ్రీకాంత్‌కు ఉద్యోగం కల్పించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని జిల్లా రిజిస్ట్రేషన్‌ అధికారి బాలాంజనేయులు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బాలాంజనేయులు మాట్లాడారు. వీఆర్వోగా పనిచేస్తూ శ్రీనివాసులు మృతి చెందారని, కలెక్టర్‌ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాన్ని కల్పించామని చెప్పారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): వెంకటాచలంలోని స్వర్ణభారత్‌ ట్రస్ట్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడ్ని పీఎంపీ, రూడ్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. జామ మొక్కను ఆయనకు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌, రూడ్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ రసూల్‌, నాగసాయిసూరి, రాఘవేంద్ర, శేఖర్‌, తదితరులు పాల్గొన్నారు.

4కే రన్‌ ట్రోఫీ ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న 4కే రన్‌కు సంబంధించిన ట్రోఫీని కలెక్టర్‌ చక్రధర్‌బాబు తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్‌, ప్రధాన కార్యదర్శి చంద్రోశేఖర్‌, కార్యదర్శి నవీన్‌, శివ, విజయ్‌, కశ్యప్‌, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నెల్లూరు(క్రైమ్‌): నగరంలోని మయూరి హోటల్‌ సమీపంలో గల సిటీ యూనియన్‌ బ్యాంక్‌ ఏటీఎంలో గుర్తుతెలియని దుండగుడు చోరీకి బుధవారం తెల్లవారుజామున యత్నించాడు. ఏటీఎం చెస్ట్‌ను తెరిచేందుకు విఫల యత్నం చేశాడు. అలారమ్‌ మోగడంతో అప్రమత్తమైన చిన్నబజార్‌ పోలీసులు ఘటన స్థలానికి చేరుకునేలోపే దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఏటీఎం కేంద్రం, పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించగా, చోరీకి యత్నించింది పాతనేరస్తుడని తేలింది. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఉద్యోగం దొరక్క.. దొంగగా మారి

నెల్లూరు(క్రైమ్‌): వైద్య కళాశాల వసతిగృహంలో ఐ ప్యాడ్లను చోరీ చేసిన ఘటనలో నిందితుడ్ని దర్గామిట్ట పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బిట్రగుంట మండలం నాగులవరానికి చెందిన ఈశ్వర్‌ వరుణ్‌తేజ్‌ డిగ్రీ వరకు చదువుకున్నారు. ఉద్యోగాన్వేషణలో భాగంగా పలు కంపెనీలకు వెళ్లగా, ఎక్స్‌పీరియన్స్‌ సర్టిఫికెట్లు అడగడంతో ఉద్యోగం రాలేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సైతం అంతంతమాత్రంగా ఉండటంతో దొంగగా మారారు. ఏసీఎస్సార్‌ వైద్య కళాశాల వసతిగృహంలో ఉంటున్న వైద్య విద్యార్థులు సాయిచంద్రయాదవ్‌, తౌఫిక్‌కు సంబంధించిన ఐ ప్యాడ్లను ఈ నెల నాలుగున అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసును నమోదు చేశారు. కళాశాల వద్ద సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడ్ని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. హరిత హోటల్‌ సమీపంలో నిందితుడ్ని అరెస్ట్‌ చేసి అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్‌ సీతారామయ్య తెలిపారు. నిందితుడిపై విశాఖపట్నంలోనూ కేసు ఉందని చెప్పారు.

త్వరలో ఆలయ నిర్మాణం



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్‌

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 13, 14, 15, 16వ డివిజన్ల వాసుల అభ్యర్థన మేరకు అనుకూల ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి త్వరలో చర్యలు చేపట్టనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌ పేర్కొన్నారు. 14వ డివిజన్‌ ఏసీనగర్‌లోని వినాయకుడి గుడి వీధి, పార్కు వీధి, ఏసీ స్నానం, బాలాజీనగర్‌ 17, 18వ అడ్డ రోడ్లు, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించి.. అర్హులకు అందేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. 40 సచివాలయాల పరిధిలో రూ.8 కోట్లతో పనులను ప్రారంభించామన్నారు. ఇందులో రూ.నాలుగు కోట్ల మేర పనులను పూర్తి చేశామని వెల్లడించారు. డివిజన్లో పార్కు నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, తదితర పెండింగ్‌ పనులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్పొరేటర్‌ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో ఐఐటీ ప్రతినిధుల భేటీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ హరితతో చెన్నై ఐఐటీ ప్రతినిధుల బృంద సభ్యులు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో వాయు కాలుష్య కారకాలు, తదితరాలపై అధ్యయనం చేసేందుకు ఏర్పడిన బృందం నగరానికి వచ్చిందని చెప్పారు. కేంద్ర పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు నోడల్‌ అధికారి కరుణాకరన్‌, చెన్నై ఐఐటీ ప్రతినిధులు ఉదిత్‌గుప్తా, విజయ్‌పాల్‌, ఇంజినీరింగ్‌ విభాగ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌, ఈఈ సంజయ్‌, డీఈ సురేష్‌, తదితరులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్‌ సైన్స్‌ కాన్ఫరెన్స్‌కు జర్నల్స్‌ ఎంపిక



మాట్లాడుతున్న శశికాంత్‌

నెల్లూరు(అర్బన్‌): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి చెందిన ఫోరెన్సిక్‌ నిపుణుడు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ శశికాంత్‌ రాసిన జర్నల్స్‌ 25వ ఆలిండియా ఫోరెన్సిక్‌ సైన్స్‌ కాన్ఫరెన్స్‌కు ఎంపికయ్యాయి. కళాశాలలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేర పరిశోధనలో డాక్టర్ల పాత్ర, దోషుల గుర్తింపునకు సంబంధించి రాసిన రెండు జర్నల్స్‌ ఎంపికయ్యాయని చెప్పారు. గవర్నమెంట్‌ ఆఫ్‌ ఇండియా, జాతీయ ఫోరెన్సిక్‌ సైన్స్‌ యూనివర్సిటీ సంయుక్తంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఫిబ్రవరి రెండు నుంచి నాలుగు వరకు నిర్వహించనున్నాయని చెప్పారు.

దాడులకు పాల్పడే వారిపై చర్యలకు వినతి



మాట్లాడుతున్న సుబ్బయ్య

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో దళితులపై దాడులు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని సీమాంధ్ర మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సుబ్బయ్య కోరారు. దర్గామిట్టలోని అంబేడ్కర్‌ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులపై ఎస్పీ విజయారావుకు వినతిపత్రాన్ని అందజేశామని చెప్పారు. దగదర్తి పెట్రోల్‌ బంక్‌లో దళిత యువకుడిపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు సకాలంలో స్పందించి, బాధ్యులపై కేసు నమోదు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. నేతలు చిన్నయ్య, సుబ్బారావు, శ్రీనివాసులు, సాల్మన్‌, ప్రసాద్‌, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్‌ ఉద్యోగుల క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న చక్రధర్‌బాబు, తదితరులు



ఎన్జీఓ భవన్‌లో..

నెల్లూరు(అర్బన్‌): హెల్త్‌ అడ్మినిస్ట్రేషన్‌ మెడికల్‌ సర్వీసెస్‌ అసోసియేషన్‌ (హంస), ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను కలెక్టర్‌ చక్రధర్‌బాబు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్‌ మాట్లాడారు. ఉద్యోగులు కష్టపడి పనిచేసి.. ప్రజలకు మంచి సేవలను అందించాలని సూచించారు. అనంతరం షిరిడీ సాయిబాబా చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందజేసి సత్కరించారు. హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి, జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణమ్మ, మేయర్‌ స్రవంతి, ఏపీజీఈఎఫ్‌ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, హంస అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ అమరేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా జనరల్‌ సెక్రటరీ కమల్‌కిరణ్‌, తదితరులు పాల్గొన్నారు.

• ఆంధ్రప్రదేశ్‌ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ టేబుల్‌ క్యాలెండర్లను దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో ఆవిష్కరించారు. ఎన్జీఓ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, వెంకటస్వామి, జిల్లా అసోసియేట్‌ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్‌ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌ చక్రవర్తి, విద్యాసాగర్‌, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ల చార్జింగ్‌



నెల్లూరు(వీఆర్సీసెంటర్‌): జనార్దన్‌రెడ్డికాలనీ సమీపంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన 13 ట్రాన్స్‌ఫార్మర్లకు చార్జింగ్‌ను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఈస్ట్‌ - 1 ఏఈ మన్మథరావు మాట్లాడారు. చార్జింగ్‌ అనంతరం సరఫరా జరిగేలా చర్యలు చేపట్టామని వివరించారు. కన్‌స్ట్రక్షన్‌ ఏడీఈ ప్రభాకర్‌, సిబ్బంది సుధాకర్‌, మనోహర్‌, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌ పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు అర్బన్‌ ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్‌ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టనున్నామని సీడీపీఓ అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 14వ డివిజన్లో గల లక్ష్మీ బోర్డు సెంటర్‌ (పీహెచ్‌సీ – ఓహెచ్‌), 54వ డివిజన్‌ గాంధీగిరిజన కాలనీ (బీసీ – ఈ), 8వ డివిజన్‌ సీఆర్పీ డొంక (ఓసీ), 36వ డివిజన్‌ బ్రహ్మానందపురం (ఎస్సీ), 42వ డివిజన్‌ మన్సూర్‌నగర్‌ (బీసీ – ఈ), ఖుద్దూస్‌నగర్‌ (బీసీ – డీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల వారు ఆయా వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్లో ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు పొదలకూరు రోడ్డులోని ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.